సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం | 4 | ఫిబ్రవరి | 2025



తొలిరోజు 13 నామినేషన్లు
మండలి నామినేషన్ల స్వీకరణ పర్వం సోమవారం మొదలైంది. తొలిరోజు 13 నామినేషన్లు దాఖలయ్యాయి. 8లో▸



భక్తిశ్రద్ధలతో వసంత పంచమి
వసంత పంచమి వేడుకలను జిల్లాలోని ఆయా విద్యాసంస్థలతో పాటు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. 9లో▸



వాతావరణం
ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. చలితీవ్రత తగ్గనుంది. పగటి ఉష్ణోగ్రత కొంత మేర పెరగనుంది.

న్యూస్‌రీల్

జిల్లా వైద్యుడికి బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డు


డాక్టర్ ఉమాకాంత్ గౌడ్

ఆదిలాబాద్‌టౌన్: క్యాన్సర్ వ్యాధి నివారణకు 17 ఏళ్లుగా కృషి చేస్తున్న ఆదిలాబాద్ జిల్లా వాసి డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ 'ది బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డు' కు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు ప్రొఫెసర్లు ఎంపిక కాగా, అందులో ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన ఉమాకాంత్‌గౌడ్ ఉన్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రాజ్‌నారాయణ, కేపీ హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కోఠిలో గల చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో మంగళవారం ఈ అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగులకు ఆర్థిక సాయం, జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పునరావాస పథకాన్ని ప్రవేశపెట్టిందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సబితా ప్రకటనలో తెలిపారు. బ్యాంకు లింకేజీ లేకుండా సబ్సిడీ రుణం పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాకు 21 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈనెల 12 వరకు ఆన్‌లైన్‌లో htpps:// tgodmms. cgg. gov. in// ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'స్పాజ్' దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: ఎస్జీటీ బదిలీల్లో స్పౌజ్ పాయింట్ దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో ప్రణీతను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీల సందర్భంగా స్పౌజ్ పాయింట్ వాడుకొని నిబంధనలకు విరుద్ధంగా ఆప్షన్లు పెట్టుకొని దగ్గర పాఠశాలలను ఎంపిక చేసుకున్న టీచర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

6నుంచి 'ప్రజావాణి' పబ్లిక్ హియరింగ్

కైలాస్‌నగర్: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో అమలు చేస్తున్న 'సీఎం ప్రజావాణి' అర్జీల పబ్లిక్ హియరింగ్ తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 6నుంచి 14 వరకు మండలాల వారీగా ఈ హియరింగ్ చేపట్టనున్నారు. 6న ఇంద్రవెల్లి, 7న తలమడుగు, 11న గాదిగూడ, నార్నూర్, మావల, తాంసి, 12న సిరికొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, 13న ఆదిలాబాద్‌రూరల్, భీంపూర్, నేరడిగొండ, బోథ్, 14న బేల, జైనథ్, ఉట్నూర్ మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో హియరింగ్ నిర్వహించనున్నారు. పైలట్ ప్రాజెక్టులో స్వీకరించిన అంశాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు, అర్జీదారుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నారు. దరఖాస్తుల ప్రగతి తీరును వివరించనున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మానంద్


నియామక పత్రం అందుకుంటూ..

ఆదిలాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పతంగే బ్రహ్మానంద్ మరోసారి ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర సంఘటన వర్క్ ఎన్నికల నియమావళి అనుసారం జిల్లా ఎన్నికల అధికారి బస్వాపురం లక్ష్మీ నర్సయ్య చేతుల మీదుగా హైదరాబాద్‌లో సోమవారం నియామక పత్రం అందుకున్నారు.

నమ్మిస్తారు.. ముంచేస్తారు

- ఆదిలాబాద్ పట్టణం విద్యానగర్‌లోని అబ్దుల్ కలామ్ రోడ్డులో ఓ ప్రైవేట్ కోఆపరేటివ్ సంస్థను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. 21 మంది సభ్యులతో కూడిన ఈ సంస్థలో చైర్మన్, డైరెక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరు కొంత మంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో సభ్యుడి నుంచి సభ్యత్వం కోసం రూ.2500 వరకు వసూలు చేశారు. మరికొంత మంది డిపాజిట్లు సైతం చేశారు. అమాయక పేదలకు రుణాలు ఇస్తామని మాయమాటలు చెప్పి అందినకాడికి దండుకున్నారు. తీరా సొసైటీ నష్టాలు వచ్చాయని ఎత్తివేశారు. పలువురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కప్పర్లకు చెందిన మృతుడి భార్య సైతం ఈ సంస్థలో సభ్యురాలే. ఇందులో పెట్టుబడి పెట్టి ఆమె నష్టపోయింది. ఈ సంస్థకు చెందిన వ్యక్తి రూ.60లక్షలు ఇవ్వాల్సి ఉందని మృతుడు సూసైడ్ నోట్‌లో రాసిన విషయం తెలిసిందే.

- ఆదిలాబాద్‌లోని ఓ సొసైటీ వారు బేల మండలంలోని లింగుగూడ చెందిన పలువురిని సభ్యులుగా చేర్చారు. మూడు నెలల పాటు డబ్బులు జమ చేస్తే రుణాలు ఇస్తామని నమ్మ బలికారు. దీంతో పలువురు రూ.25వేల వరకు ఏజెంట్లకు చెల్లించారు. ఎరువులు, విత్తనాలు ఇస్తామని చెప్పి.. ఇవ్వకపోవంతో బాధితులు లబోదిబోమన్నారు.

- ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో ఓ ప్రైవేట్ సొసైటీ ఉంది. ఇందులో వందలాది మందిని సభ్యులుగా చేర్చారు. రోజుకు రూ.200 నుంచి రూ.300 చొప్పున జమ చేయించారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకొని రుణాలు ఇస్తామని సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేయించారు. ఆరు నెలల తర్వాత ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతో ఇప్పటికీ ఆ ప్రైవేట్ కోఆపరేటివ్ సొసైటీ చుట్టూ బాధితులు తిరుగుతూనే ఉన్నారు. ఈ సొసైటీపై కూడా గతంలో వన్‌టౌన్‌లో కేసు నమోదైంది.

- ఆదిలాబాద్‌లోని తెలంగాణ చౌక్ ప్రాంతంలో ఓ కోఆపరేటివ్ సంస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు రుణాలు ఇస్తామని మాయమాటలు చెప్పారు. గ్రామాలకు వెళ్లి ఏజెంట్ల ద్వారా డబ్బులు వసూలు చేశారు. తీరా చేతులు ఎత్తివేయడంతో మావల మండలం వాగాపూర్‌కు చెందిన కొందరు మావల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ సొసైటీ వారు బాధితులకు డబ్బులు ఇస్తామని ఒప్పుకున్నారు. ఇప్పటికీ ఈ సొసైటీ వారు చాలా మందికి డబ్బులు ఇవ్వాల్సి ఉంది.


ఆదిలాబాద్ పట్టణంలోని ప్రైవేట్ సొసైటీ కార్యాలయాలు

- అమాయక పేదలే వారి టార్గెట్
- రుణాలిస్తామంటూ వసూళ్లు
- ఊరూరా తిరుగుతూ సభ్యత్వం.. ఆపై ఎగవేత
- ప్రైవేట్ సొసైటీల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం
- గతంలో రెండు సంస్థలపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: పేద అమాయక ప్రజలు, గిరిజనులే వీరి టార్గెట్. కొంత మంది కలిసి ప్రైవేట్ సొసైటీని ఏర్పాటు చేస్తారు. సభ్యులుగా చేరితే, వ్యక్తిగతంగా, గ్రూపులకు రుణాలు ఇస్తామని నమ్మబలుకుతున్నారు. వారి నుంచి సభ్యత్వం పేరిట రూ.2500 వరకు వసూలు చేస్తారు. నెల లోపు రుణం ఇప్పిస్తామని మాయమాటలు చెబుతారు. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే తక్కువ సమయంలో రెట్టింపు డబ్బులు ఇస్తామని నమ్మిస్తారు. ఇలా వీరి బుట్టలో పడ్డవారిని నిండా ముంచుతారు. కొన్ని ప్రైవేట్ సొసైటీలు బాగానే నిర్వహిస్తున్నా, మరికొన్ని మాత్రం దోపిడీ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. రుణాలు ఇవ్వకుండా డబ్బులు తీసుకొని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడమే ఇందుకు నిదర్శనం. ఇటీవల ఓ కుటుంబం సామూహికంగా ఆత్మహత్యకు పాల్పడడం సైతం ఇందులో పెట్టుబడి పెట్టడమే కారణమని తెలుస్తోంది.

జిల్లాలో ఇలా..
జిల్లాలో మొత్తం 1,350 వరకు సహకార సొసైటీలు ఉన్నాయి. వీటిలో వ్యాక్టో యాక్ట్ కింద 750 వరకు, పీఏసీఎస్ సొసైటీలు 35 వరకు, మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీలు 20, ఇలా వివిధ రకాల సొసైటీలు ఉన్నాయి. ముఖ్యంగా వీటిలో మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీలు కొన్ని దోపిడీకి పాల్పడుతున్నాయి.

నిలువు దోపిడీ చేస్తూ..
మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సహకార సంఘాలు కొన్ని అమాయకులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. సభ్యులుగా చేరండి.. రుణాలు ఇస్తాం, రైతులకైతే ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్లు, ఇతర పరికరాలు ఇస్తామని ముగ్గులోకి దించుతున్నారు. తీరా సభ్యులుగా చేరి డబ్బులు కట్టిన వారికి తిరిగి ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారు. వీరిపై చర్యలు చేపట్టే వారు లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొంత మంది పోలీసులను ఆశ్రయిస్తుండగా, మరికొంత మంది ఎవరికి చెప్పాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఇక సహకార శాఖ అధికారులు తమకు ఫిర్యాదు చేస్తే తప్పా తనిఖీలు చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

దోపిడీ ఇలా..
కోఆపరేటివ్ సొసైటీలు గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకొని మొదట రూ.1500 నుంచి రూ.2500 వరకు తీసుకొని సభ్యులుగా చేర్చుకుంటున్నారు. ఆ తర్వాత అకౌంట్‌లో రూ.2వేలు ఉండాలని అదనంగా వారి నుంచి తీసుకుంటున్నారు. ఆరు నెలల పాటు జమ చేసిన డబ్బుకు రెండింతలు కలిపి రుణాలు ఇస్తామని నమ్మబలుకుతున్నారు. రూ.10వేలు చెల్లిస్తే రూ.20వేలు, ఇలా రుణాలు ఇస్తాం.. ఎరువులు, విత్తనాలు ఇస్తామంటూ నమ్మిస్తారు. తీరా డబ్బులు చెల్లించిన గడువు ముగియడంతో సభ్యులు సంబంధిత సొసైటీ కార్యాలయానికి వెళ్తున్నారు. మీ అకౌంట్‌లో రూ.2వేలు మాత్రమే ఉన్నాయి, మిగతావి మీరు ఏజెంట్‌కు ఇచ్చారు.. వారినే అడగాలని చెబుతున్నారు. అప్పటికే ఏజెంట్లు ఆ సంస్థలో విధులు మానేసి మరో సంస్థలో చేరుతున్నారు. ఇలా ఎక్కడబడితే అక్కడ అందినకాడికి దండుకొని ఉడాయిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..



ప్రైవేట్ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరి మోసానికి గురైతే మాకు ఫిర్యాదు చేయాలి. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఆర్‌కే సొసైటీకి సంబంధించి కేసు నమోదైంది. ఫిర్యాదు చేయకపోతే విచారణ చేపట్టలేం. ప్రజలు బ్యాంకుల్లో డబ్బులు జమ చేసుకోవడం మంచిది. ఎవరిని గుడ్డిగా నమ్మి మోసపోవద్దు. బాధితులు నేరుగా వచ్చి సంప్రదించవచ్చు. – బి.మోహన్, జిల్లా సహకార శాఖ అధికారి, ఆదిలాబాద్

ప్రైవేట్ వ్యక్తులను నమ్మి మోసపోవద్దు



తక్కువ సమయంలో రెట్టింపు డబ్బు ఇస్తామని ఇటీవల కాలంలో ప్రైవేట్ వ్యక్తులు, కొన్ని సొసైటీల వారు ప్రజలను మోసం చేస్తున్నారు. ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎవరూ చిట్టీలు కట్టవద్దు. అత్యాశ పడొద్దు. బ్యాంకుల్లో డబ్బులు జమ చేసుకోవడం మంచిది. సొసైటీల ద్వారా మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం. – ఎల్.జీవన్ రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

క్షయ రహిత జిల్లా లక్ష్యం

- కలెక్టర్ రాజర్షి షా


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. టీబీ నిర్మూలన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించామన్నారు. వ్యాధిని కట్టడి చేసేందుకోసం గ్రామాల్లోనూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం టీబీ ముక్త్ భారత్‌పై జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేయాలి
పోషణ చర్చలో భాగంగా మండల ప్రత్యేకాధికారులు అన్ని పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేసి మెనూ, విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కోసం ఫిబ్రవరిలో స్నాక్స్ అందించేందుకు గాను ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, జిల్లా క్షయ నిర్మూలన అధికారి సుమలత, డీఈవో ప్రణీత, ఆర్‌ఐవో రవీందర్ పాల్గొన్నారు.

చేపల విక్రయాల సంచార వాహనం ప్రారంభం
ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.10.38 లక్షల వ్యయంతో జైనథ్ మండలం పెండల్వాడ గ్రామానికి చెందిన టాప్రే సునీతకు చేప ఉత్పత్తుల విక్రయ సంచార వాహనాన్ని మంజూరు చేశారు. విక్రయాలకు సిద్ధం చేసిన ఆ వాహనాన్ని కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ రాజర్షి షా జెండా ఊపి ప్రారంభించారు.

అర్జీలిచ్చి.. ఆవేదన వెలిబుచ్చి

- గ్రీవెన్స్‌కు తరలివచ్చిన బాధితులు
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: తమ సమస్యలను నివేదించేందుకు వచ్చిన బాధితులతో ప్రజావాణి సోమవారం సందడిగా సాగింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొని అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేలా చూడాలని అక్కడే ఉన్న సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అందుబాటులో లేని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అదపపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 78 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదిన..


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

• జీపీగా ఏర్పాటు చేయాలి



మేమంతా బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్ పంచాయతీ పరిధిలో గల బలన్‌పూర్, కొత్తపల్లి గ్రామస్తులం. ఈ రెండు గ్రామాల్లో ఉండేది ప్రధాన్, గోండులే. జనాభా 500కు పైగానే ఉంది. వీటిని కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని 2017 సెప్టెంబర్‌లో అప్పటి కలెక్టర్‌కు విన్నవించాం. అయితే ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. గిర్నూర్ జీపీ మాకు ఐదు కిలోమీటర్లు ఉంటుంది. పైగా ఎలాంటి వసతులు లేవు. త్వరగా మా ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నాం.

• చెరువును పునర్నిర్మించాలి



మేమంతా జైనథ్ మండలంలోని పెండల్వాడ గ్రామ రైతులం. మా గ్రామంలో ప్రభుత్వం చెరువు నిర్మిస్తామని చెప్పడంతో 30 మంది రైతులం 105 ఎకరాల సాగు భూమిని 2004లో ఇచ్చాం. పరిహారం అందించి అందులో చెరువును నిర్మించింది. 2006లో వచ్చిన భారీ వరదలతో కట్ట తెగిపోయి ఆనవాళ్లను కోల్పోయింది. దాన్ని పునర్నిర్మించి మా భూములకు సాగునీరందేలా చూడాలని అప్పటి ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించినా పటించుకోలేదు. ప్రస్తుతం ఈ భూమిలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు అధికారులు ఆలోచిస్తున్నారు. ఇదే జరిగితే తాము నష్టపోయే పరిస్థితి ఉంది. మాకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నాం.

• పార్కు ప్రాంతంలో ఎస్టీపీ వద్దు..



మేమంతా బట్టిసావర్గాం పంచాయతీ పరిధి లోని సర్వేనం .71/1/2, 72/1/3ల్లోని ప్రభుత్వ లేఅవుట్ రాజీవ్ స్వగృహ ప్లాట్ కొనుగోలు దారులం. టీజీఐఐసీ అధికారులు ఇక్కడ సౌకర్యాలు కల్పించడంలో భాగంగా పార్కు ప్రాంతంలో సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ను నిర్మిస్తున్నారు. చిన్నారులు ఆటలాడుకునే, కాలనీవాసులు ఆహ్లాదంగా గడిపే చోట ఈ ప్లాంట్‌ను నిర్మిస్తుండటంతో దుర్గంధంతో భవిష్యత్తులో అనారోగ్యకర వాతావరణం ఏర్పడే అవకాశముంది. అలాగే ఇళ్ల మెయిన్ గేట్ ఎదుట మ్యాన్‌హోళ్లను నిర్మిస్తున్నారు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. వాటిని తక్షణమే నిలిపివేయించి లేఅవుట్ ప్రతిపాదనల ప్రకారం నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

• వేతనాలు పెంచాలి



మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని శిశుగృహలో మేమంతా ఆయాలు, వాచ్‌ఉమెన్‌గా ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నాం. షిఫ్టుల వారీగా 24గంటల పాటు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న మాకు నెలకు కేవలం రూ.7,940 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో కనీస కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. పెరిగిన ధరలు దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

• భూ పట్టాలు జారీచేయాలి



మేమంతా జైనథ్ మండలకేంద్రానికి చెందిన ఎస్సీ కులస్తులం. 1981లో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. అయితే ఇప్పటి వరకు ఆ భూములకు అధికారులు పట్టాలు ఇవ్వలేదు. వాటి కోసం మండల, జిల్లా స్థాయి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. పట్టాలు లేని కారణంగా రైతుబంధు, బ్యాంకు రుణాలు వంటివి అందడం లేదు. వెంటనే పట్టాలు జారీ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం.

అమ్మకు మొక్కి.. అక్షరాలు దిద్ది


కుమారుడితో అక్షరాలు దిద్దిస్తున్న తల్లి


అక్షరాభ్యాస మండపంలో పూజలు చేస్తున్న అర్చకుడు

- వైభవంగా వసంత పంచమి వేడుకలు
- పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- గోదావరిలో పుణ్యస్నానం.. పిల్లలకు అక్షరాభ్యాసం

భైంసా/బాసర: బాసర సరస్వతీక్షేత్రం సోమవారం భక్తజన సంద్రమైంది. అమ్మవారి జన్మదినంగా భావించే వసంత పంచమి శుభ ముహూర్తాన అమ్మవారి దర్శనం, చిన్నారుల అక్షరాభ్యాస పూజలకు తరలివచ్చిన అశేష జనవాహినితో.. వాణి క్షేత్రం పులకించింది. తెల్లవారు జామున 2గంటలకు అమ్మవారికి అభిషేక సేవతో ఉత్సవం ప్రారంభమైంది. అర్చకులు, వేదపండితులు అమ్మవారికి విస్తృత పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొనేందుకు తరలివచ్చిన భక్తులతో అర్ధరాత్రి నుంచే గోదావరిలో స్నానఘట్టాలు నిండిపోయాయి. అమ్మవారి దర్శనానికి, చిన్నారుల అక్షరాభ్యాసానికి వేకువజామున 4 గంటల నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. గంటల తరబడి క్యూలో నిలబడేందుకు ఇబ్బంది పడుతూనే అమ్మవారిపై విశేష భక్తితో సరస్వతీ నమస్తుభ్యం అని స్మరిస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు, అర్చనలు చేయించారు. తర్వాత పిల్లలను తమ ఒడిలో కూర్చోబెట్టుకొని అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ ఆశీస్సులతో తమ పిల్లలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని, చదువులో మేటిగా రాణించాలని వేడుకున్నారు.

ప్రత్యేక అలంకరణ...
ఆలయ గర్భగుడిని పూలతో అందంగా అలంకరించారు. ప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. ప్రధాన ద్వారం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రవేశం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అతిథి గృహాల ముందు బారికేడ్లు ఏర్పాటు చేసి లోనికి పంపించారు. చండీ హవనం, వేద పారాయణ పూజలు నిర్వహించారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు..
తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన అభిషేక పూజలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అమ్మవారికి కలెక్టర్ అభిలాష అభినవ్ ఆలయ అధికారులతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావు పటేల్, విఠల్ రెడ్డి, ఆత్రం సక్కు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉదయం నుంచి రాత్రి వరకు...
ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం రాత్రే బాసరకు వచ్చిన భక్తులతో దారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు వాహనాలు, రైలు మార్గంలో భక్తులు చేరుకున్నారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక నుంచి తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేసినా పెరిగిన రద్దీతో అవి సరిపోలేదు. క్యూలైన్ దేవాలయ అతిథి గృహాలు దాటి ప్రధాన రోడ్డుకు చేరింది. చిన్నారులు, వృద్ధులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండలేక అవస్థలు పడ్డారు. ప్రసాదాల కౌంటర్ వద్ద గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. అమ్మవారి ప్రసాదాలు తీసుకునేందుకు భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. అమ్మవారి ఆలయానికి సోమవారం ఒక్కరోజే వివిధ అర్జిత సేవాటికెట్ల విక్రయం ద్వారా రూ.1,01,83,823 ఆదాయం సమకూరింది.

భక్తులకు పలు సేవలు..
ఆలయం తరపున చిన్నారులకు పాలు, బిస్కెట్లు, అరటిపండ్లు, తాగునీరు పంపిణీ చేశారు. ఎస్పీ జానకీ షర్మిల బందోబస్తు పర్యవేక్షించారు. ఇక పోలీసులు అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, స్నానఘట్టాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిన వాహనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు.

పడవ ప్రయాణం...
గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పడవలో ప్రయాణించారు. కుటుంబీకులు, స్నేహితులతో కలిసి ఆహ్లాదంగా గడిపారు. వ్యాస మహర్షి గుహ వద్ద భక్తులు వరుస కట్టారు. బస్టాండ్ వద్ద ఉన్న వేదవతి శిలను రాళ్లతో కొట్టి అందులో నుంచి వచ్చే శబ్దాన్ని విని ఆనందపడ్డారు. మొత్తంగా బాసర ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

పకడ్బందీగా మోడల్ కోడ్ అమలు

- కలెక్టర్ రాజర్షి షా
- రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులతో సమావేశం

కైలాస్‌నగర్: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల అధికారిగా కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీవో ఆదిలాబాద్, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, 10 వరకు కొనసాగుతుందని తెలిపారు. 11న పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుందన్నారు. అలాగే 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలని, ర్యాలీలు, సమావేశాలు, సభలు తదితర వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నోడల్ అధికారులుపాల్గొన్నారు.

నోడల్ అధికారులు వీరే ...
ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందు కోసం నోడల్ అధికారులను నియమించినట్లుగా కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్‌పోర్టు మేనేజ్‌మెంట్ అధికారిగా ఎ.శ్రీనివాస్ (ఆర్టీవో), పోలీసు నోడల్ అధికారిగా శ్రీనివాస్ (డీఎస్పీ), మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ జి. జితేందర్‌రెడ్డి(జెడ్పీ సీఈవో), వ్యయ పరిశీలకులుగా బి.మోహన్ (సహకార శాఖ అధికారి), బ్యాలెట్ పేపర్/ పోస్టల్ బ్యాలెట్ ముద్రణ రాథోడ్ రవీందర్ (డీఆర్డీవో), మీడియా నోడల్ అధికారిగా తిరుమల (డీపీఆర్వో), పరిశీలకులుగా వెంకటేశ్వర్లు (డీవైఎస్‌వో)ను నియమించినట్లుగా పేర్కొన్నారు.

క్లుప్తంగా

రిమ్స్‌లో చికిత్స చేయించుకున్న సుగుణ



చికిత్స పొందుతున్న ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ రిమ్స్ ఆస్పత్రిలో చేరారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో వైద్యులు ఆదివారం రాత్రి ఆమె కాలికి ఉన్న కణితిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచడానికి, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రోగులు ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్షర చిట్‌ఫండ్ యాజమాన్యంపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్షర చిట్‌ఫండ్ యాజమాన్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. జైనథ్ మండలంలోని బాలాపూర్‌కు చెందిన జక్కుల రమేశ్ ఆదిలాబాద్ పట్టణంలోని అక్షర చిట్‌ఫండ్‌లో రూ.10 లక్షల చిట్టీ కట్టాడు. 20 నెలల పాటు చిట్టీ డబ్బులు చెల్లించాడు. నిర్మల్‌లో అక్షర చిట్‌ఫండ్ బ్రాంచ్‌ను మూసివేసినట్లు తెలుసుకున్న ఆయన ఆ తర్వాత చిట్టీ డబ్బులు చెల్లించలేదు. ఇదివరకు కట్టిన డబ్బులు తిరిగి చెల్లించాలని ఇటీవల యాజమాన్యంతో మాట్లాడాడు. రూ.5లక్షల బాండ్ డిపాజిట్ చేయాలని, అదనంగా రూ.లక్ష 60వేలు ఇస్తామని అక్షర చిట్‌ఫండ్ నిర్వాహకులు చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన భార్య పేరిట బాండ్ ఇచ్చినట్లు తెలిపారు. బాధితుడికి రూ.80వేలు మాత్రమే ఇచ్చారని, మిగితా డబ్బులు ఇచ్చేందుకు ఇబ్బందులకు గురిచేయడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

లారీని విక్రయించిన వ్యక్తిపై..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన సోహెల్‌ఖాన్ లారీని విక్రయించిన అబ్దుల్ హకీమ్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. సోహెల్‌ఖాన్ బొక్కల్‌గూడకు చెందిన అబ్దుల్ హకీమ్‌కు మూడు నెలల క్రితం అగ్రిమెంట్ ద్వారా రూ.19 లక్షలకు లారీ విక్రయించాడు. దానికి సంబంధించిన రూ.4లక్షలు ఇవ్వాల్సి ఉందని, మిగితా రూ.15 లక్షలు బ్యాంక్ ఈఎంఐ చెల్లించాల్సి ఉందన్నారు. మూడు నెలల నుంచి ఆయన కనిపించకుండా పోయాడని, ఆ లారీని ఇతరులకు విక్రయించినట్లు తెలిపారు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోగా బ్యాంకులో కిస్తీలు కూడా చెల్లించడం లేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వివరించారు.

బడిలో 'బ్యాడ్ టీచర్స్'

- బిడ్డల్లాంటి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న 'టీచకులు'
- నిర్మల్ జిల్లాలో ఇటీవల తరచూ ఘటనలు
- 'నర్సాపూర్'లో ఇద్దరు టీచర్లు సస్పెన్షన్
- సక్రమంగా స్పందించని హెచ్‌ఎంపైనా చర్య
- పోక్సో కేసు పెట్టాలంటూ సంఘాల డిమాండ్



నిర్మల్: ప్రస్తుత సమాజంలో ఎవరు మంచివాళ్లో.. ఎవరు చెడ్డవాళ్లో గుర్తించడం చాలా కష్టమవుతోంది. గుడిలాంటి బడిలో దేవుడిలాంటి ఉపాధ్యాయుడు సైతం దారి తప్పుతున్నాడు. తన బిడ్డల్లాంటి విద్యార్థులకు విద్యాబుద్ధులు, మంచి నడవడికను నేర్పించాల్సిన బాధ్యతలో ఉండి 'బ్యాడ్'గా ప్రవర్తిస్తున్నాడు. తండ్రిలాంటి సార్ తనపై ఎందుకు చేయివేస్తున్నాడో.. ఏం మాట్లాడుతున్నాడో కూడా తెలియని అమాయక విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాడు. ఇలాంటి కొంతమంది కీచక టీచర్ల కారణంగా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే కళంకం వస్తోంది. నిర్మల్ జిల్లాలో ఇలా.. ఒకట్రెండు కాదు.. ఇటీవల కంటిన్యూగా విద్యార్థినులతో ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఘటనలు చోటు చేసుకోవడం కలవర పెడుతోంది. ఇలాంటి విషయాలు తెలిసిన వెంటనే విద్యాశాఖ తాత్సారం చేయడమూ ఆందోళన కలిగిస్తోంది.

స్కూల్లో కీచకపర్వం..

తమ విద్యార్థులకు చదువు, సంస్కారం నేర్పాల్సిన పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు కీచకపర్వం కొనసాగిస్తున్నారు. తాజాగా నర్సాపూర్(జి) ఉన్నత పాఠశాలలో ఇద్దరు సీనియర్ ఉపాధ్యాయులు తమ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన తీరు మరోసారి సభ్యసమాజాన్ని, ప్రధానంగా ఉపాధ్యాయలోకాన్ని తలదించుకునేలా చేసింది. బాధిత విద్యార్థులు ధైర్యం చేసి తమ తల్లిదండ్రులకు చెప్పడం, వారు వెంటనే స్పందించడంతో సదరు టీచర్లపై వేటు పడింది. ఇదే ఘటనలో సకాలంలో సక్రమంగా స్పందించని పాఠశాల ప్రధానోపాధ్యాయుడూ సస్పెన్షన్‌కు గురయ్యాడు.

వరుస ఘటనలు..

ఇటీవల కలెక్టర్ సీసీకి సంబంధించిన ఘటన మరువక ముందే తాజాగా బడిలో బ్యాడ్‌టీచర్ల తీరు వెలుగులోకి వచ్చింది. ఇక పాఠశాలల్లో కీచక ఘటనలు ఇప్పుడే కొత్త కాదు. ఇటీవల వరుసగా ఇలాంటివి చోటు చేసుకుంటుండటం కలవర పెడుతోంది. సోన్ మండలంలోని ఓ గ్రామ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు ఇలాగే విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. కుభీర్ మండలంలో గతేడాది ఓ పీఈటీ కీచకపర్వం విద్యాశాఖను కుదిపేసింది. ఇదే మండలంలో ఓ భాషోపాధ్యాయుడు సైతం విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఉన్నత పాఠశాలలోనూ ఓ ఉపాధ్యాయుడి తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యవహారాల్లో చాలావరకు సంబంధిత విద్యాశాఖాధికారులు సక్రమంగా స్పందించకపోవడం, కొన్నింటిని బయటకు రాకుండా మేనేజ్ చేయడం చేస్తున్నారు. తాజా ఘటనలో కారకులైన ఉపాధ్యాయులపై పోక్సో కేసు పెట్టాలని పలు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

చిట్టితల్లులపై దుష్టచేష్టలు..

ఉపాధ్యాయుడు.. అనగానే పెద్దవాళ్లమే గుడ్డిగా నమ్మేస్తాం. అలాంటిది పిల్లలు..? పాపం, వాళ్లకేం తెలుసు.. ఆ పసిమనసులకు చుట్టూ ఉన్న ఈ పాపపు సమాజం గురించి. ఆ అంకుల్ తనచేతికి చాక్లెట్ ఇచ్చి ఎక్కడెక్కడ చేతులు వేస్తున్నాడో.. చెప్పలేని వయసు. తాతయ్యలాంటోడని దగ్గరికెళ్తే ఏం చేస్తున్నాడో.. గుర్తించలేని మనసు. అసలు.. తల్లిదండ్రుల తర్వాత అత్యధికంగా పిల్లలు ఇష్టపడేది గురువులనే. అలాంటి ఉపాధ్యాయుడూ కీచకుడై.. తమ పట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడో.. పసిగట్టలేని అమాయకత్వం. బోధనను అడ్డుపెట్టుకుని తమపై చేస్తున్న దారుణాన్ని గుర్తించలేకపోతున్నారు. అసలు ఇలాంటి విషయాలను తల్లిదండ్రులకు చెప్పాలన్న విషయమూ తెలియని పిల్లలెందరో ఉన్నారు. ఒకవేళ ఇంట్లో చెబితే.. తమనే ఏమంటారోనన్న భయంతోనూ చాలామంది తమలో తామే కుమిలిపోతున్న దాఖలాలూ ఉన్నాయి.

ఏది గుడ్‌టచ్.. ఏది బ్యాడ్‌టచ్..

తల్లిదండ్రులే పిల్లలకు సాటి సమాజంలో మనుషులతో పాటు మనుషుల్లా ఉండే మృగాలూ ఉంటాయన్న విషయాన్ని చెప్పాల్సిన దుస్థితి వచ్చింది. 'ఏది గుడ్ టచ్–ఏది బ్యాడ్ టచ్..' అనే విషయాన్ని తమ పిల్లలు కచ్చితంగా గుర్తించేలా వివరించాలి. తనపట్ల ఎవరైనా సరే.. బ్యాడ్‌గా ప్రవర్తిస్తే తమకు చెప్పేలా వారిని సిద్ధం చేయాలి. ఆడబిడ్డలకే కాదు.. మగబిడ్డకూ ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించాలి. ఏ ఆడబిడ్డపై చేయి వేయకూడదన్న విషయాన్ని గట్టిగా చెప్పాలి. వీలు చేసుకునైనా సరే.. ఆడబిడ్డలకు కనీసం కరాటే, జూడోవంటి ఆత్మరక్షణ కోర్సులను నేర్పించాలి. ఎప్పుడూ చదువే కాదు.. ప్రస్తుత సమాజం గురించీ చెబుతూ ఉండాలి.

ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నిర్మల్‌చైన్‌గేట్/నర్సాపూర్(జి): విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన నర్సాపూర్(జి) పాఠశాలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను కలెక్టర్ అభిలాష అభినవ్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు రావడంతో నర్సాపూర్(జి) ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి(స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్), ఎస్.మోహన్‌రావు (స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్)తో పాటు ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్‌ఎం కిషన్‌రావును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై శాఖా పరమైన విచారణ కొనసాగుతోందని, కారకులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ



డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న క్లూస్‌టీం

సారంగపూర్: మండలంలోని లక్ష్మీపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు గుడి తలుపులు తెరిచి ఉండడం గమనించి ఎస్సై సాయికుమార్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. హుండీ తాళం పగులగొట్టి ఉండడంతో పాటు అమ్మవారిపైన అలంకరించిన 3 గ్రాముల బంగారం, 15 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అనంతరం క్లూస్‌టీం సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. గ్రామస్తుడు సంజీవ్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన పి.రాజేశ్వర్ ద్విచక్ర వాహనం ఆదివారం చోరీకి గురైంది. రోజులాగే ఉదయం ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేసి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చేసరికి వాహనం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కలా వెతికినా కనిపించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై పద్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రాణం తీసిన అతివేగం

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన బైక్
- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



రాజశేఖర్(ఫైల్)

జన్నారం: అతివేగం ఓ నిండుప్రాణాన్ని బలి తీసుకుంది. బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన జన్నారం మండలం కలమడుగులో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం కమ్మునూరు గ్రామానికి చెందిన రాయవేని రాజశేఖర్ (32), తన బంధువు మోదెల గ్రామానికి చెందిన అల్లం రవికుమార్‌తో కలిసి కలమడుగులోని బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు ఆదివారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. గోదావరి వంతెన దాటిన తర్వాత పెట్రోల్ బంక్ సమీపంలో అతివేగంగా వచ్చిన బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఘటనతో బైక్‌పై ఉన్న ఇద్దరూ ఎగిరిపడ్డారు. గమనించిన స్థానికులు ధర్మపురి ఆస్పత్రికి తరలించగా రాజశేఖర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రగాయాలపాలైన రవికుమార్‌ను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఎస్సై రాజవర్ధన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నాన్నా అన్న పిలుపు వినకుండానే..

రాజశేఖర్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. పిల్లల కోసం ఎన్నో దేవుళ్లకు మొక్కుకున్నారు. గతేడాది కుమార్తె (15 నెలలు) జన్మించింది. కూతురిచేత నాన్నా అన్న పిలుపు వినకుండానే తండ్రి మృతి చెందడం కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఓమన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి



మల్లేశ్ (ఫైల్)

జన్నారం: కూతురి పెళ్లి వారం రోజుల్లో ఉందనగా ఆదివారం రాత్రి ఓ వార్త ఆ కుటుంబాన్ని ఆందోళనకు గురిచేసింది. కుటుంబ పెద్ద గుండెపోటుతో మృతి చెందాడన్న వార్తతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన దుర్గం మల్లేశ్ (48) గతేడాది ఉపాధి నిమిత్తం ఓమన్ వెళ్లి సలాల్‌లోని బల్దియా కంపెనీలో పని చేస్తున్నాడు. ఈనెల 8న శనివారం అతని కూతురు వివాహం నిశ్చయమైంది. కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామ దేవత పెద్ద పోచమ్మ తల్లికి పూజలు చేశారు. సాయంత్రం ఓమన్ దేశంలో మల్లేశ్ గుండెపోటుకు గురై తానుంటున్న గదిలోనే మృతి చెందాడు. తోటి కార్మికులు ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటి వరకు సందడిగా ఉన్న ఇల్లు ఒక్కసారి బోసిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..



నర్సయ్య(ఫైల్)

సోన్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటనమండలంలోని పాక్‌పట్లలో చోటు చేసుకుంది. ఏఎస్సై షేక్ హైమద్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రైతు బోర నర్సయ్య (45) మొక్కజొన్న పంట రక్షణ కోసం రాత్రి సమయంలో ఎర్త్‌వైర్‌తో బల్బు వెలిగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఎర్త్‌వైర్‌తో ఉన్న బల్బును తిద్దామని వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుని కుమారుడు దీక్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ టీచర్..



వెంకట్‌రెడ్డి (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కౌట గ్రామానికి చెందిన నోముల వెంకట్‌రెడ్డి సోమవారం తన కుమారుడు శరత్‌రెడ్డితో కలిసి కారులో కౌట(బి) నుంచి నిర్మల్‌కు వెళ్తుండగా నారాయణపూర్ జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్తున్న కారును ఢీకొట్టారు. ఘటనలో వెంకట్ రెడ్డి(75) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు.

రైలు కిందపడి సింగరేణి కార్మికుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంచిర్యాల శివారులో చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు సీసీసీ నస్పూర్‌కు చెందిన రాచర్ల సురేశ్ (30) ఐకే–1 గనిలో బదిలీఫిల్లర్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో కలహాలు పెరగడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి మంచిర్యాల శివారులోని గోదావరి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ప్రణీత, కూతురు యశ్విని ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఒకరు..

ఉట్నూర్‌రూరల్: మద్యంమత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని భీంజీగూడలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన తొడసం భీంరావ్ (25)కు జైనూర్ మండలానికి చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండడంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో సోమవారం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్య సమస్యలతో..



శ్రీనివాస్ (ఫైల్)

జైపూర్: అనారోగ్య సమస్యలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు ఎస్టీపీపీ రైల్వేట్రాక్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న మండలంలోని టేకుమట్లకు చెందిన కొత్తపల్లి శ్రీనివాస్ (34) కొంతకాలంగా నరాల సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. రెండు రోజుల క్రితం అతని భార్య తేజ పుట్టింటికి వెళ్లింది. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


బుడుందేవ్ ఆలయ అభివృద్ధికి కృషి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: బుడుందేవ్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం శ్యాంపూర్‌లో బుడుందేవ్ జాతర ప్రారంభించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులతో కలిసి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం మెస్రం వంశీయులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆదివాసీ పెద్దలపై ఉందన్నారు. అనంతరం మెస్రం వంశీయులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పశువుల అక్రమ రవాణాను ఉపేక్షించం



మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

వాంకిడి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పశువులను అక్రమంగా రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. వాంకిడి మండలంలో చిచ్చుపల్లి, గోయేగాం, గణేశ్‌పూర్ గ్రామాల శివారులో పశువులను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన స్థావరాలపై సోమవారం ఆయన మఫ్టీలో మెరుపు దాడులు నిర్వహించారు. సోనాపూర్ జీపీ చిచ్చుపల్లి శివారులో ఏర్పాటు చేసిన పశువుల అడ్డాలో 50కి పైగా పశువులు పట్టుబడగా అస్వస్థతతో ఉండడంతో పశు వైద్యుడిని పిలిపించి వైద్యం చేయించారు. గణేశ్‌పూర్ శివారులోని పశువుల అడ్డాలో 20కి పైగా పశువులు, గోయేగాం శివారులోని అడ్డాలో 15 పశువులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ దాడులను పసిగట్టిన అక్రమార్కులు అడ్డాల్లో కట్టి ఉంచిన పశువులను పంట పొలాల్లో వదిలేశారన్నారు. అయినా సిబ్బందితో కలిసి దాదాపు వంద పశువులను స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న గోపి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేశాఖ పరిధిలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తామని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్, రైల్వే ఇనిస్టిట్యూట్ చైర్మన్ ఏ.గోపి అన్నారు. సోమవారం రైల్వే ఇనిస్టిట్యూట్‌లో వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. అంతకు ముందు షటిల్ కోర్టును ఏడీఎస్ టి.వెంకటేశ్వర్లు, ఏడీఈఈ ఎం.ముఖేష్, ఫ్లడ్‌లైట్లను ఎస్ఎస్ఈఎం రతన్ మాలోత్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ ఒద్ది రమేశ్, అసిస్టెంట్ సెక్రటరీ సాల్మన్, రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 13 నామినేషన్లు

- మొదలైన మండలి నామినేషన్ల పర్వం
- గ్రాడ్యుయేట్ స్థానానికి ఆరుగురు, టీచర్ స్థానానికి ముగ్గురు
- మొత్తం 13 సెట్ల పత్రాలు దాఖలు చేసిన అభ్యర్థులు
- ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి: రిటర్నింగ్ అధికారి



టీచర్స్ ఎమ్మెల్సీ నామినేషన్ సమర్పిస్తున్న కె.రఘోత్తంరెడ్డి

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ రెండు స్థానాలకు కలిపి 9 మంది నామినేషన్లు దాఖలు చేశారు. గ్రాడ్యుయేట్ స్థానానికి ఆరుగురు, టీచర్ స్థానానికి ముగ్గురు నామినేషన్లు వేశారు. వీరిలో ఇద్దరు గ్రాడ్యుయేట్, టీచర్స్ రెండు స్థానాలకు నామినేషన్లు వేయగా, మొత్తం 13 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తన చాంబర్‌లో నామినేషన్లను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 10 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 8, 9 తేదీల్లో ప్రభుత్వ సెలవుల కారణంగా స్వీకరణ ఉండదన్నారు. ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్, వచ్చేనెల 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సందేహాలు నివృత్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చేవారికి, రాజకీయ నాయకులు, ప్రతినిధులు వారి సందేహాలను అక్కడ నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలని, ర్యాలీలు, సమావేశాలు, సభలు తదితర వాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి..


కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సిలివేరు శ్రీకాంత్ అనే అభ్యర్థి ఇటు గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు రెండు రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన దూడ మహిపాల్, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడెంకు చెందిన గవ్వల లక్ష్మి, మేడ్చల్ కు చెందిన కంటే సాయన్న గ్రాడ్యుయేట్ స్థానానికి ఒక్కో సెట్ నామినేషన్ సమర్పించారు. హైదరాబాద్ కు చెందిన చాలిక చంద్రశేఖర్ గ్రాడ్యుయేట్ స్థానానికి రెండు సెట్ల నామినేషన్ అందజేశారు. ఆదిలాబాద్ కు చెందిన మంచికట్ల ఆశమ్మ ఒక సెట్టు నామినేషన్ వేశారు.

టీచర్స్ ఎమ్మెల్సీకి ముగ్గురు..

టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి కూర రఘోత్తంరెడ్డి, చాలిక చంద్రశేఖర్ ఒక్కోసెట్టు, సిలివేరు శ్రీకాంత్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటేశ్వర్లు, మైనార్టీ శాఖ అధికారి పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిని పొంది...అనువదించి

- ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తిపై అనువాదరచన
- నిర్మల్ ఉపాధ్యాయుడి ఘనత



అనువాదం చేసిన పుస్తకంతో రచయిత

నిర్మల్‌ఖిల్లా: చిన్ననాటి నుంచి ప్రముఖ భారతీయ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి రచనలను అమితంగా ఇష్టపడిన నిర్మల్ ఉపాధ్యాయుడు ఆయనపై ప్రముఖ ఆంగ్ల రచయిత మార్క్‌లీ మూడు దశాబ్దాల క్రితం చేసిన రచనను తాజాగా తెలుగులోకి అనువదించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం ప్యారామూర్ గ్రామానికి చెందిన కాసు మచ్చేందర్ ఇదే మండలంలోని బీరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటర్ చదువుతున్న రోజుల నుంచి కృష్ణమూర్తి రచనలపై మక్కువ ఏర్పర్చుకుని ఆయనపై విడుదలైన ప్రతీ పుస్తకాన్ని చదివారు. కృష్ణమూర్తి ప్రసంగాలు, జీవితసారం, ధ్యానం ప్రాధాన్యతపై ఆంగ్లభాషలో మార్క్‌లీ అనే రచయిత 1995లో రచించిన 'ద బుక్ ఆఫ్ లైఫ్' అనే గ్రంథాన్ని తెలుగులోకి తర్జుమా చేయాలని నిర్ణయించుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై కేంద్రంగా గల కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అంగీకారంతో రెండేళ్ల పాటు శ్రమించి తెలుగులోకి అనువదించారు. తాజాగా గత జనవరిలో 'జీవితమే ఓ పుస్తకం' అనువాద గ్రంథం ప్రచురితమైంది. ఇటీవల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పుస్తకాన్ని సాహితీ విపణిలోకి విడుదల చేశారు. రానున్న రోజుల్లో 'ఫైర్ ఇన్ ద మైండ్' పుస్తకాన్ని తెలుగులోకి అనువదించనున్నట్లు మచ్చేందర్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. సిర్పూర్ మండలం కొమ్ముగూడకు చెందిన మారు రుణం ఇప్పించాలని, బోథ్ మండలం కోటపల్లికి చెందిన సోమన్న బోరు బావి మంజూరు చేయాలని, సిర్పూర్(యు) మండలం రాగాపూర్‌కు చెందిన కోవ శంభు కిరాణ దుకాణం కోసం రుణం ఇప్పించాలని కోరారు. వీటితో పాటు వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.